ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 5, నవంబర్ 2026

రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన

బజార్‌హత్నూర్ ఎస్ఐ రమేష్

బజార్‌హత్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లాలో ఓ అవినీతి పోలీస్ అధికారి నిర్వాకం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఒక కేసు వ్యవహారంలో బాధితుడిని వేధించి, లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్, ఒక కేసు విషయమై బాధితుడి నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తంలో ఇచ్చుకోలేనని, తనను కరుణించాలని బాధితుడు బ్రతిమిలాడటంతో, చివరికి రూ. 40 వేలు ఇచ్చేలా ఎస్ఐ ఒప్పందం కుదుర్చుకున్నాడు.అయితే, ఎస్ఐ రమేష్ వేధింపులను భరించలేని బాధితుడు నేరుగా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు పక్కా ప్రణాళికతో వ్యూహాత్మకంగా వల పన్నారు. బుధవారం రోజున బాధితుడి వద్ద నుంచి ఎస్ఐ రమేష్ రూ. 40 వేల లంచం డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకున్న అధికారులు, వెంటనే ఎస్ఐ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. ఎస్ఐపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా తక్షణమే 9440446106, నంబర్, అలాగే 1064 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని, అవినీతి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు ప్రజలకు సూచించారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

బాసర ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

వివిధ శాఖల అధికారులతో బాసరలో సమీక్షా సమావేశం

నిర్మల్ జిల్లా ప్రతినిధి,

నవంబర్ 04, ప్రభాతవార్త:

రానున్న పవిత్ర గోదావరి పుష్కరాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల ఏర్పాట్లను ముందస్తుగా పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల ప్రారంభ సమయానికి ప్రతిపాదనల్లో ఉన్న అన్ని అభివృద్ధి పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. బుధవారం బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఈవో కార్యాలయ ప్రాంగణంలో మిగతా 2లో..

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై లక్ష్యాన్ని సాధించాలి

❊ గిరిజన యువత పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

❊ ఉట్నూర్ వైటీసీలో పీసీ, ఎస్సై ప్రిలిమినరీ పరీక్షల అభ్యర్థులతో ముఖాముఖి

❊ కంప్యూటర్ ల్యాబ్‌ల పరిశీలన, అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉట్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

ఏజెన్సీ ప్రాంత గిరిజన యువత పట్టుదలతో శ్రమించి చదివి కాంపిటీటివ్ ఉద్యోగాలను సాధించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమినరీ పరీక్షలకు హాజరవుతున్న గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ మిగతా 2లో..

గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు

కృషి చేయాలి

★ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్

★ ఉట్నూర్ కొలం గూడలో ఘనంగా అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి వేడుకలు

★ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం: కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్

ఉట్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లాలో అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి వేడుకలను ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండలం కొలం గూడ గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ మంద మకరందు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు కుంరం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని

పిలుపునిచ్చారు. భూ సమస్యలు, అటవీ హక్కుల గుర్తింపునకు సంబంధించి కోర్ ఏరియాలు, భూమి కేటాయింపులు, అటవీ ప్రాంత హక్కులపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి గిరిజన బిడ్డలకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గిరిజనులు తమకు లభించిన చట్టపరమైన హక్కులను, కోర్టుల ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో కొలమ్ జాతికి చెందిన సుమారు 7,000 కుటుంబాలు ఉన్నాయని, 9 శాఖల ద్వారా పీఎం జన్మన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలు, పోడు భూముల సమస్యలు, అలాగే ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టంలోని కొలమ్, నివాసం, కమ్యూనిటీ అనే 3 రకాల హక్కులపై ప్రత్యేక దృష్టి సారించామని, త్వరలోనే అర్హులైన వారికి తగిన ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మిగతా 2లో..

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై లక్ష్యాన్ని సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రణయ్‌లతో కలిసి అభ్యర్థులతో క్షేత్రస్థాయి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తీవ్ర పోటీ ఉండే ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించడానికి సరైన మార్గదర్శకత్వం, నిరంతరం ప్రాక్టీస్ చేయడం ఎంతో కీలకమైన అంశాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ముందుగా తమ బలహీనతలను స్పష్టంగా గుర్తించి, నిపుణులైన ఫ్యాకల్టీ సహాయంతో వాటిని త్వరగా అధిగమించాలని సూచించారు. డిసెంబర్ 20 నాటికి జరగబోయే ప్రిలిమినరీ పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉన్నందున, అభ్యర్థులు పరీక్షా విధానం, ప్రశ్నపత్రం సరళి, సమగ్ర సిలబస్, మార్కుల విభజనపై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలని స్పష్టం చేశారు. సమయపాలన పాటిస్తూ రోజువారీ చదువును ఎలా కొనసాగించాలి, గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా సమయాన్ని ఎలా ఆదా చేసుకోవాలి అనే విభిన్న అంశాలపై విలువైన సూచనలు చేశారు. అభ్యర్థులు స్వీయ క్రమశిక్షణతో, సడలని పట్టుదలతో చదివి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని, ఐటీడీఏ అందుబాటులోకి తెచ్చిన శిక్షణా వనరులను సద్వినియోగం చేసుకొని సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ చేతుల మీదుగా నోట్‌బుక్స్, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ తర్వాత వైటీసీ ప్రాంగణంలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను పరిశీలించి అభినందించారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగభూషణం, వైటీసీ నిర్వహణా సిబ్బంది, రీజనింగ్ ఫ్యాకల్టీ కార్తీక్, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, నూతన సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పుష్కర ఘాట్ల అత్యవసర మరమ్మతులు, కొత్త ఘాట్ల నిర్మాణం, భక్తుల కోసం మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిండ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, సాధారణ భక్తుల పార్కింగ్ స్థలాలు, వీఐపీ పార్కింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తుల అపార రద్దీకి తగినట్లుగా మోలిక వసతులు కల్పించాలని, విచ్చేసే ప్రముఖుల వసతి సౌకర్యాలకు తగిన ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేపట్టిన ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను క్షుణ్ణంగా సమీక్షించిన కలెక్టర్, ఎలాంటి జాప్యం లేకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ నిర్మాణ పనులను అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సుభాష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాల్లో జీయర్ గురుకులం అవగాహన

- నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విద్యార్థుల భారీ ర్యాలీ

- పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

సారంగాపూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే తీవ్ర నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అల్లంపల్లి జీయర్ గురుకులం విద్యార్థులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జీయర్ గురుకులం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి, అల్లంపల్లి, బాబునాయక్ తండా, మంగల్ సింగ్ తండాల పరిధిలోని పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రతికూల పరిస్థితులలో రైతులు వరి సాగుకు దూరంగా ఉంటూ, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అవగాహన కల్పించారు. ఇప్పటికే భూగర్భ జలాలు తగ్గి నీటి కొరత కారణంగా కొన్ని వరి పొలాలు ఎండిపోయిన దుస్థితిని విద్యార్థులు గ్రామస్తులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రతను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ పద్ధతులు, పొదుపు సూత్రాలను ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యావరణ అవగాహన కార్యక్రమంలో జీయర్ గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధర్, అల్లంపల్లి, బాబునాయక్ తండాల సర్పంచులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో గిరిజన విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలు

- నవంబర్ 06న నిర్మల్ ఏహెచ్ఎస్ (బాయ్స్), ద్యాంగాపూర్ పాఠశాలల్లో నిర్వహణ

- క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: పీఓ ఐటీడీఏ

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా పరిధిలోని గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రత్యేక క్రీడా ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఎంపిక పోటీలను నిర్మల్ పట్టణంలోని ఏహెచ్ఎస్ (బాయ్స్), ద్యాంగాపూర్ పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన (శుక్రవారం) నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎంపిక పోటీలలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలకు చెందిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడానికి అర్హులు. వివిధ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ఇతర పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన గిరిజన విద్యార్థులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ), నిర్మల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీవో) తెలిపారు.కావున నిర్మల్ జిల్లాలోని గిరిజన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ క్రీడా ఎంపిక పోటీలలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని నిరూపించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం కోసం జిల్లా గిరిజన స్పోర్ట్స్ ఆఫీసర్ భూక్య రమేష్‌ను (ఫోన్ నంబర్: 9441395674) సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు విద్య, ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను అనుసరించాలని, వాటిని భావితరాలకు అందజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ, ఐటీడీఏ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా పక్కా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీలకు రావలసిన బకాయిల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని, త్వరలోనే బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఉపాధి పనుల దినాలు తక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం మెరుగైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, గ్రామాల్లో ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పివిటిజి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోనేరావు, జిల్లా అధ్యక్షులు వసంత్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు, సంఘ నాయకులు, కొలమ్ కుల బాంధవులు, పోలీసులు, ఇతర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉట్నూర్ జీడీసీలో ఘనంగా ప్రారంభమైన 3 రోజుల జనరేటివ్ ఏఐ శిక్షణా కార్యక్రమం

- టాస్క్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

- ఆధునిక సాంకేతికతతోనే విజ్ఞానం, ఉపాధి అవకాశాలు: ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్

ఉట్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల కొమరం భీమ్ సెమినార్ హాల్ (రూమ్ నెం. 16) వేదికగా 3 రోజుల పాటు నిర్వహించనున్న "జనరేటివ్ ఏఐ" ప్రత్యేక శిక్షణా కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. "స్కిల్ టుడే... సక్సెస్ టుమారో" అనే ఆదర్శ నినాదంతో తలపెట్టిన ఈ 3 రోజుల నిరంతర శిక్షణా కార్యక్రమంలో భాగంగా తొలి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రాబోయే రోజుల్లో విద్యార్థులకు చాట్‌జీపీటీ, జెమిని, క్లాడ్, మిడ్‌జర్నీ, పర్‌ప్లెక్సిటీ, కోపైలట్ వంటి అత్యాధునిక ఏఐ టూల్స్‌తో పాటు జీపీటీ5, జెమిని 2.5 వంటి నెక్స్ట్ జెనరేషన్ ఏఐ మోడల్స్‌పై క్షేత్రస్థాయిలో విస్తృతమైన శిక్షణ కల్పించనున్నారు. ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ సమక్షంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు సాంకేతికతపై ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి. ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంత విద్యార్థులను గ్లోబల్ డిజిటల్ విప్లవానికి అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని డిగ్రీ స్థాయిలోనే అలవాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి, పరిశోధనా అవకాశాలు లభిస్తాయని కొనియాడారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ ఎస్.కె. ముజీబ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సాయి ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. రాణి, టాస్క్ రిసోర్స్ పర్సన్ సాయి కుమార్, ట్రైనర్ కె. వికాస్, కళాశాల అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు

సారంగాపూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావు బుధవారం సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని వివిధ విభాగాల ఫైళ్లను, కీలక రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం కౌట్ల బి గ్రామంలో ప్రాధాన్యతతో జరుగుతున్న భూముల రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. భూముల రీసర్వే ద్వారా రైతులకు కలిగే భూమి హక్కుల భద్రత, ప్రయోజనాలను వారికి స్పష్టంగా వివరించారు. భూముల సర్వే ప్రక్రియలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, ఏ ఒక్క రైతుకూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అలాగే స్వర్ణ ఇరిగేషన్ ప్రాజెక్టు భూములకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న సర్వే విధానాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. సర్వే పనులను ఏమాత్రం జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సారంగాపూర్ తహసీల్దార్ బి. విజయ కాంత్ రావ్, నాయబ్ తహసీల్దార్ రాంచందర్, ఇరిగేషన్ ఏఈ మధుపాల్, సర్వేయర్ యోహాన్, జీపీఓలు, గిర్దావర్ వెంకట్ నర్సయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి

అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, నవంబర్ 04, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటశాల, భోజన ఏర్పాట్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మల్లిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న మహిళా సంఘాల వి.ఓ. భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు అనువైన వసతులు కల్పించేలా భవన నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల నిర్వహణను పరిశీలించారు. అక్కడి వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణం, పూర్తయిన భోజనశాలను పరిశీలించారు. విద్యార్థినులకు నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటశాల నిర్వహణతో పాటు పాఠశాలలోని ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతు వేదికలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న వీబీజీ రామ్‌జీ శిక్షణ కార్యక్రమానికి హాజరై శిక్షణా తరగతుల నిర్వహణ, సిబ్బందికి కల్పిస్తున్న అవగాహన, శిక్షణా విధానాలను పరిశీలించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ సిబ్బందికి పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో భీమిని మండల తహసీల్దార్ బికర్ణదాస్, కన్నెపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: ఏపిఎమ్ లలిత

జన్నారం, నవంబర్ 4, ప్రభాతవార్త:

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఈడిఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్ఎస్‌డిపి 158 - హెర్బల్ ధూప్ స్టిక్స్ తయారీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు జొన్నలక్ష్మి, డిఆర్‌డిఎ ఐకెపి ఎపిఎమ్ లలిత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిఐఐ ప్రాజెక్ట్ ఆఫీసర్ బుక్యా దేవేందర్ నాయక్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, వివోఏలు ముల్కాల రవీందర్, రాథోడ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ పి ఎమ్ లలిత మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసిన మహిళలు తమ నైపుణ్యాలను ఉపయోగించుకొని సొంత వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. హెర్బల్ ధూప్ స్టిక్స్, అగరబత్తులు, ఆవు పేడ ప్రమిదలు తదితర ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్లో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయాలకు ఐకెపి తరఫున అవసరమైన సహకారం అందిస్తామని, మార్కెట్లో ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు మద్దతు కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పొందిన ప్రతి మహిళ ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

- ఉన్నత చదువులకోసం రూ. 10 వేలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులు

చెన్నూర్, నవంబర్ 4, ప్రభాతవార్త

నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ శాఖ ఆర్థిక చేయూత అందించి సేవా కార్యక్రమంలో ఆదర్శంగా నిలిచింది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన నితీషకు ఉన్నత విద్యాభ్యాసం కోసం క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. నితీష సికింద్రాబాద్‌లోని ఉస్మానియా పీజీ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో కోర్సు, హాస్టల్ ఫీజులు చెల్లించడం కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు స్పందించి, విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం క్లబ్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కలిగించకూడదనే ఉద్దేశంతో తమ వంతు సహాయం అందించినట్లు తెలిపారు. నితీష ఉన్నత చదువులు పూర్తి చేసి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యాభ్యాసానికి మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు.

కార్మిక నాయకుడికి రాజకీయ వేదిక

- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా సిద్ధం శెట్టి సాజన్ నియామకం

బెల్లంపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన సిద్ధం శెట్టి సాజన్‌కు రాజకీయంగా కీలక బాధ్యతలు లభించాయి. ప్రస్తుతం సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ యూనియన్ నుండి మందమరి ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న ఆయనను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం సిద్ధం శెట్టి సాజన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, అనంతరం కార్మిక ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయనకు ఈ నియామకం తగిన గుర్తింపుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సిద్ధం శెట్టి సాజన్‌కు పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తూనే, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బాధ్యతతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

టీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా లెనిన్

లక్షెట్టిపేట, నవంబర్ 04, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర సమితి మంచిర్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన బాణాల లెనిన్‌నిషా నూతనంగా నియమితులయ్యారు. పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజా సేవలో చురుకుగా పనిచేస్తున్న ఆయన కృషిని గుర్తించి పార్టీ అధ్యక్షురాలు కవిత బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా నూతన జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పేదలు, రైతులు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం నిజాయితీగా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

చింతగూడలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జన్నారం, నవంబర్ 4, ప్రభాతవార్త

జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన బాదావత్ రాజ్యనాయక్ (42) మృతి చెందారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఆయన అప్పుల ఒత్తిడితో మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగి గోదావరి ఒడ్డున అపస్మారక స్థితిలో పడి ఉన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జన్నారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఉదయం 10:50 గంటల ప్రాంతంలో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య బాదావత్ కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

దండారి దర్బార్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త

కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పల వాగు ప్రాంతంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన దండారి దర్బార్ ఉత్సవాల్లో బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సోదరులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని వారి సంప్రదాయాలు, సంస్కృతి, కళా వైభవాన్ని ఆస్వాదించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు కొనసాగాలని, గిరిజనుల ఆచార వ్యవహారాలు, కళారూపాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సాంప్రదాయ ఉత్సవాల్లో ఆదివాసీ సోదరులతో కలిసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట మండల అధ్యక్షుడు రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ సోదరులు పాల్గొన్నారు.

ఒప్పందం చేసుకున్న 24 డిమాండ్లను తక్షణమే అమలు చేయాలి

- ఏఐటీయూసీ నాయకులు - శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ధర్నా

- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్

నస్పూర్, నవంబర్ 4, ప్రభాతవార్త

లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యం కుదుర్చుకున్న 24 డిమాండ్ల ఒప్పందాన్ని తక్షణమే అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం తాము సమ్మె నోటీసు ఇవ్వడంతో లేబర్ కమిషన్ సమక్షంలో యాజమాన్యం 24 డిమాండ్లపై ఒప్పందం చేసుకుందని, కానీ వాటి అమలులో తీవ్ర జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్ అభ్యర్థులకు పెండింగ్‌లో ఉన్న నియామక పత్రాలను వెంటనే అందజేయాలన్నారు. ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహిస్తామని ఒప్పందంలో పేర్కొని.. కేవలం మూడు నెలలు మాత్రమే నిర్వహించి అర్ధాంతరంగా నిలిపివేయడం సరికాదని, వెంటనే బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మారుపేర్ల సమస్యతో పెండింగ్‌లో ఉన్న అర్హులైన అభ్యర్థులందరికీ, ప్రత్యేకించి 35 నుంచి 45 ఏళ్ల వయస్సు గల వారికి నిబంధనల ప్రకారం వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా సొంత ఇంటి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు గనుల్లో కార్మికుల రక్షణ కోసం బూట్లు, హెల్మెట్లు, డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్లు, యంత్రాల స్పేర్ పార్టులను వెంటనే సరఫరా చేయాలని కోరారు. అలాగే జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సంస్థకు రావాల్సిన రూ. 59 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శి సంపత్, జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, గొర్రె నర్సయ్య, గండి సతీష్, సురేష్, పిట్ కార్యదర్శులు గుణిగంటి నర్సింగారావు, సారయ్య, మోతే లచ్చన్న, నవీన్ రెడ్డి, సదానందం, అగు శ్రీకాంత్, గజ్జి రమేష్, పెద్ద సంఖ్యలో డిపెండెంట్ అభ్యర్థులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ.. ప్రతిభకు ప్రోత్సాహం

మంచిర్యాలలో విశ్వవిద్యాలయ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించిన మేయర్ ధర్ని మధుకర్

మంచిర్యాల, నవంబర్ 4, ప్రభాతవార్త:

మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ పాఠశాల క్రీడా మైదానంలో సీవీ రామన్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయ స్థాయి క్రికెట్ పోటీలను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మంచిర్యాల జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగవరపు వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు రమణ, కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

మంచిర్యాల క్లబ్‌లో ఉత్సాహంగా పోటీలు.. 150 మంది క్రీడాకారులు

మంచిర్యాల, నవంబర్ 4, ప్రభాతవార్త

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల నిర్వహణలో, బ్యాడ్మింటన్ అసోసియేషన్, మంచిర్యాల క్లబ్ సౌజన్యంతో బుధవారం హైటెక్ కాలనీలోని మంచిర్యాల క్లబ్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ స్రవంతి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు రవాణా శాఖ అధికారి శివశంకర్ వరప్రసాద్, విద్యుత్ శాఖ డీఈ రాజేశం, మోటార్ వాహన తనిఖీ అధికారి రవీందర్, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి యాకూబ్, బ్యాడ్మింటన్ కార్యదర్శి సుధాకర్, క్లబ్ కోశాధికారి సత్యపాల్ రెడ్డి, మెడిలీఫ్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి, రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్, నిర్వహణ కార్యదర్శి ఆర్. రాజయ్య పాల్గొన్నారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్, నందం శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, గాజుల శ్రీనివాస్, బోయిని శ్రీనివాస్, జంపాల రమేష్, భూమన్నతో పాటు జిల్లా నలుమూలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సాగునీరు అందించాలని రైతుల రాస్తారోకో

జన్నారం, నవంబర్ 4, ప్రభాతవార్త

చివరి దశలో ఉన్న వరి పంటకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతగూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై చింతగూడ గ్రామానికి చెందిన రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈనెల 7 నుండి కడెం ప్రాజెక్టు నుండి సాగునీరును నిలిపివేస్తామని అధికారులు ప్రకటించడం శోచనీయమని రైతులు విమర్శించారు. సాగునీరు అందించకపోతే మండల వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడిగా వి. అనిల్ రెడ్డి నియామకం

నస్పూర్, నవంబర్ 4, ప్రభాతవార్త

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా వి. అనిల్ రెడ్డి నియమితులయ్యారు. సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన, ప్రస్తుతం కార్మిక సంఘం హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మొదటి నుంచీ పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత, ఆయనను మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ రెడ్డి నియామకం పట్ల పార్టీ శ్రేణులు, సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ... తనపై పూర్తి నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితకు, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిప్పారపు సారయ్యకు, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

విద్యుత్ అంతరాయం లేకుండా నూతన స్తంభాల ఏర్పాటు

చెన్నూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామంలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా నూతన స్తంభాలను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ తోకల మల్లేశ్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు మంజూరైన 40 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించడంలో భాగంగా మంగళవారం బట్టే వాడ, సిద్ధివాడ, రెడ్డి వాడ నుంచి శివారం రోడ్డు వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని విద్యుత్ లైన్లు వదులుగా ఉండటం, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ మల్లేష్ తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తుమ్మల తిరుపతి రెడ్డి, జేఎల్ఎం సురేష్, ఎల్ఐ రాయమల్లు, పంచాయతీ కార్యదర్శి వసంత, వార్డు సభ్యులు సిద్ధి లాస్య, రంజిత్, చందుపట్ల సాగర్ రెడ్డి, సంపత్ రెడ్డి, కొలకాని నవీన్, పరికీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో జన్నారం విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

బెల్లంపల్లి, నవంబర్ 04, ప్రభాతవార్త

జన్నారం పీఎంశ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని వాల్యూపిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించారు. సుమారు 60 మంది విద్యార్థిలు ఐటీఈఎస్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనబుల్డ్ సర్వీసెస్) విభాగంలో భాగంగా పారిశ్రామిక పర్యటనలో వాల్యూపిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించారు. సంస్థలో ఉద్యోగులు నిర్వహించే విధులు, పని చేసే విధానం, వివిధ రకాల ప్రాజెక్టులు, ఐటీ రంగంలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, కార్యాలయ వాతావరణం, పని తీరు తదితర అంశాలను విద్యార్థినులు ప్రత్యక్షంగా పరిశీలించారు. సంస్థ మేనేజర్ ఆదర్శ్ వర్ధన్ రాజు విద్యార్థినులకు సంస్థలో జరిగే కార్యకలాపాలు, ఉద్యోగుల పని విధానం, సంస్థ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల గురించి వివరించి, ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ పారిశ్రామిక పర్యటన విద్యార్థినులకు ఐటీ రంగంపై ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తులో తమ కెరీర్‌ను ఎంచుకోవడానికి ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్యూపిచ్ సంస్థ అడ్మిన్ సుధాకర్, నెట్‌వర్కింగ్ ఇంజినీర్ రామసాగర్, మహేష్, పాఠశాల హెడ్ మాస్టర్ గొల్ల రామన్న, ఉపాధ్యాయులు పద్మజ, సుధాకర్, శ్రావతి, ఐటీఎస్ ఇన్‌చార్జ్ సునీత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వీ-బీజీ ఆర్‌ఏఎంజీ మేట్‌లకు శిక్షణ

మందమర్రి, నవంబర్ 4, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో బుధవారం వీబీజీ ఆర్‌ఏఎంజీ మేట్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేట్‌లు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను ఎంపీడీవో రాజేశ్వర్ క్షుణ్ణంగా వివరించారు. కూలీల హాజరు నమోదు, పనుల కొలతలు తీసుకోవడం, మస్టర్ల నిర్వహణ తదితర అంశాలను సక్రమంగా చేపట్టాలని ఆయన సూచించారు. అలాగే కూలీలు ఉపాధి పనులకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎస్తర్ దేవిడ్, ఈసీ మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అంబాజీ బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త :

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బుధవారం జాదవ్ అంబాజీ బాధ్యతల స్వీకరించారు. గతంలో ఇన్చార్జిగా పనిచేసిన సురేష్ సస్పెన్షన్ కు గురి కావడంతో గిరిజన సంక్షేమ శాఖ డిడిగా పని చేస్తున్న జాదవ్ అంబాజీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ కె హరిత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఈడీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో విజయ్ పాల్, ఏఈఓ విజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి

మంచిర్యాల, నవంబర్ 4, ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బీసీ కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని ఇస్లాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా సమగ్ర బీసీ కులగణన జరగకపోవడం విచారకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కులగణన చేపడతామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ లేకపోవడం బీసీలకు అన్యాయమని విమర్శించారు. బీసీల జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, చట్టసభలు, స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పెద్దల్ల చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు గజ్జల వెంకటయ్య, కడారి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో యువతే కీలకం

- దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల,నవంబర్ 4, ప్రభాతవార్త

2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలపడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఈ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ - 2047లో భాగంగా మంచిర్యాల పట్టణంలోని ఎంఐఎంఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో యువత ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ విద్య, ఉపాధి, పరిశ్రమల స్థాపన, వ్యవసాయ రంగాల అభివృద్ధి, సంస్కరణలపై విద్యార్థులతో చర్చించారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి యువత తమ సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు రావాలని, ప్రతి ఒక్కరూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని రఘునాథ్ వెరబెల్లి కోరారు. ఈ కార్యక్రమంలో అమీరిశెట్టి రాజ్‌కుమార్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఆకుల అశోక్ వర్ధన్, సత్యనారాయణ, కమలాకర్ రావు, రాకేష్ రెన్య, బింగి ప్రవీణ్, తరుణ్ సింగ్, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4, ప్రభాతవార్త

జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిరోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా చేయాలని, ఏ గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 16 నుండి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోరు, సింగిల్ పేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్ లైన్ల పనులను పరిశీలించి, మరమ్మత్తు ఉన్నట్లయితే వెంటనే చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, మిషన్ భగీరథ ఈ.ఈ. రాకేష్, ఇంట్రా గ్రిడ్ ఈ.ఈ. ఎం.ఎ. సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పార్క్ మోడలింగ్ పోటీల్లో ఫైనలిస్ట్‌గా ఆసిఫాబాద్‌కు చెందిన దుర్గం స్వాతి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 4, ప్రభాతవార్త :

తెలంగాణ ఫ్యాషన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "తెలంగాణ స్పార్క్ – బిగ్గెస్ట్ మోడలింగ్ పేజెంట్ ఇన్ తెలంగాణ్ణ పోటీల్లో ఆసిఫాబాద్‌కు చెందిన దుర్గం స్వాతి ఫైనలిస్ట్‌గా ఎంపికయ్యారు. మిసెస్ కేటగిరీలో ఫైనలిస్ట్‌గా నిలిచిన స్వాతిని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి బుధవారం తన నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ఆసిఫాబాద్ నుంచి రాష్ట్రస్థాయి మోడలింగ్ పోటీల్లో ఫైనల్‌కు చేరుకోవడం గర్వకారణమన్నారు. గ్రాండ్ ఫినాలేలోనూ స్వాతి విజేతగా నిలిచి ఆసిఫాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పేర్కొంటూ స్వాతికి శుభాకాంక్షలు తెలిపారు.

6న జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

బజార్‌హత్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

పాఠశాల క్రీడా సమాఖ్య ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 06న జిల్లా స్థాయి నెట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. మాధవి, ఎస్‌జీఎఫ్ సంయుక్త కార్యదర్శి అడే రామేశ్వర్ ఒక ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్‌పీఎస్ఎస్ పాఠశాల మైదానంలో ఈ ఎంపికలు జరగనున్నాయి. వయోపరిమితి 14 సంవత్సరాలు అలాగే 17 సంవత్సరాలు బాలబాలికలు మాత్రమే పోటీల్లో పాల్గొనదలచిందిగా పేర్కొన్నారు. విద్యార్థులు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిచే ధృవీకరించబడిన బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకొని రావలన్నారు. క్రీడాకారులు అందరూ ఉదయం 9:30 గంటలకల్లా ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీలు నిర్వహించే క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. భూమన్న, ఆర్గనైజర్‌గా జెడ్‌పీఎస్ఎస్ బజార్‌హత్నూర్ పీడీ షేక్ అఖిల్ వ్యవహరిస్తారు. ఇతర వివరాల కొరకు ఆర్గనైజర్ షేక్ అఖిల్ (సెల్ నెం: 9849549271) లేదా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడే రామేశ్వర్‌లను సంప్రదించగలరు.

మంచిర్యాలకు జాతీయ ఖ్యాతి.. హిప్నాసిస్ కౌన్సిల్ పగ్గాలు శేశి కిరణ్‌కు!

- జాతీయ చైర్‌పర్సన్‌గా మంచిర్యాల వాసి నియామకం

- హైదరాబాద్‌లో జాతీయ సమ్మిట్‌లో అధికారిక ప్రకటన

మంచిర్యాల, నవంబర్ 4 , ప్రభాతవార్త:

మంచిర్యాల జిల్లాకు చెందిన హిప్నాసిస్ రంగ నిపుణుడు శేశి కిరణ్ చెఱుకు అరుదైన ఘనత సాధించారు. ఇండియన్ హిప్నాసిస్ కౌన్సిల్ జాతీయ చైర్‌పర్సన్‌గా ఆయన నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బిర్లా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జాతీయ హిప్నాసిస్ సమ్మిట్‌లో కౌన్సిల్‌ను అధికారికంగా ప్రారంభించి, ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సమ్మిట్‌లో జాతీయ హిప్నాసిస్ దినోత్సవం నిర్వహణకు ప్రతిపాదన, హిప్నోథెరపీ రంగంలో విశేష సేవలందించిన వారికి జేమ్స్ ఎస్డైల్ పురస్కారాలు-2026 ప్రదానం, జాతీయ కౌన్సిల్ ఆవిర్భావం వంటి కీలక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 4న జాతీయ హిప్నాసిస్ దినోత్సవం నిర్వహించాలని శేశి కిరణ్ చేసిన ప్రతిపాదనకు వివిధ రాష్ట్రాల నిపుణులు మద్దతు తెలిపారు.దేశవ్యాప్తంగా హిప్నాసిస్ రంగంలో వృత్తిపరమైన ప్రమాణాలు, నైతిక విలువలు, శిక్షణ, ధ్రువీకరణ, పరిశోధనలు, ప్రజల్లో అవగాహన పెంపొందించడం కౌన్సిల్ ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు, హిప్నోథెరపిస్టులు, ప్రముఖులు హాజరయ్యారు.మంచిర్యాల వాసి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల జిల్లా ప్రజలు, మేధావులు, వృత్తి నిపుణులు హర్షం వ్యక్తం చేస్తూ శేశి కిరణ్‌కు అభినందనలు తెలిపారు. ఆయన నియామకం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

వాడి వేడిగా సర్వ సభ్య సమావేశం

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు

- అరగంట పాటు సమావేశం వాయిదా - ఎంపీడీవో జోక్యంతో కొనసాగిన సమావేశం

కెరమెరి, నవంబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం 45 రోజులకు ఒకసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సాయికుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని 19 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావలసి ఉండగా కేవలము 10 శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు.. దీంతో సర్పంచులు ముకుమ్మడిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రత్యేక అధికారి, డి ఏ ఓ వెంకట్ ను ప్రశ్నించారు. గతంలో సైతం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాలేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించి ఇప్పుడే ఒక కార్యాలయం బయటకి వచ్చేసారు. దీంతో ఎంపీడీవో సాయి కుమార్ గౌడ్ జోక్యం చేసుకొని, తాను ఎంపీడీవో పదవి బాధ్యతలు చేపట్టిన మొదటి సమావేశం కావడంతో సమావేశానికి హాజరు కావాలని, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు తమ దృష్టికి తీసుకువచ్చినటువంటి సమస్యలను మరో దాపం నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని కల్లా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో తిరిగి సమావేశానికి యధావిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదట వ్యవసాయకు శాఖ మండల అధికారి ఏవో యుగేందర్, ఎపివో మల్లయ్య, విద్యుత్ శాఖ రమేష్,అటవీ సెక్షన్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ సిడిపిఓ పార్టీ మన ఫాతిమ, ఐకెపి ఎపిఎం ముక్తేశ్వర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ వారి నివేదికలను సభ ముందు చదివి వినిపించారు.ఈ నేపథ్యంలో పలువురు సర్పంచులు గ్రామాల్లో చేపట్టినటువంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆయా గ్రామాల సంబంధించిన సర్పంచులు ఇబ్బందులకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు గ్రామపంచాయతీ పరిధిలో గతంలో చెప్పినట్టుగానే విద్యుత్ పరమైన సమస్యలు, విద్యుత్ తీగలను సరి చేయడం, ట్రాన్స్ఫార్ ల ట్రాన్స్ఫారంల చుట్టూ రక్షణ కంచలు ఏర్పాటు కోరుతూ అధికారులను విన్నవించారు. ఎల్ నేనో ప్రభావంతో మండలంలో పత్తి రైతులకు దిగుబడి లేక అనేక మంది రైతులు నష్ట పోయే పరిస్థితి నెలకొందని, కొన్ని గ్రామాల్లో ఐదు క్వింటాల్ పత్తి దిగుబడి రానటువంటి గ్రామాలలో క్షేత్రస్థాయిలో సందర్శించి పంట నష్ట అంచనా విలువలను రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు. పలు అభివృద్ధి పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నట్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. అమల అభివృద్ధి కోసం అటవీ అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఖర్చుల వివరాలు అభివృద్ధిపై ప్రత్యేక వెబ్సైట్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాప్ లో ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు ఆ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. మండల ప్రత్యేక అధికారి, డీఏవో వెంకట్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో యాసంగికి ఆలోచించే పంటలు వేయాలన్నారు. జిల్లాలో మూడు మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువ నమోదు కావడంతో కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. మిగతా మండలాల్లో సాధన వర్షపాతం నమోదయినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పంట నష్టం జరిగినటువంటి రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.త్వరలోనే మండల వ్యవసాయ విస్తరణ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరిస్తారని తెలిపారు. విధుల పట్ల నిరక్ష్యం వహించిన సిబ్బంది పై చర్యలు తీసుకుంటామన్నారు.కరంజి వాడ వ్యవసాయ విస్తరణ అధికారిని విధులపై నిరక్ష్యం విషయంలో కరంజి వాడ సర్పంచ్ రాథోడ్ బల్వంత్ ఫిర్యాదు చేయడంతో షోకాస్ నోటీస్ ఇవ్వాలని ఏవో ను ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై సంబంధిత శాఖల ఉన్నత అధికారుల ద్వారా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు మండల సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీవో గా పదవీ బాధ్యతలు చేపట్టిన సాయికుమార్ గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం లక్ష్మ్ణ్ రావు, పెందోర్ ఆనంద్ రావు, కావుడే తులసిరాం, కురం నాణేశ్వర్, జాదవ్ అమూల్, కు డ్మేత కొద్దు, బుచ్చయ్య, శారద, రోజా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

23వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమ్మె

ఆసిఫాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త :

వైద్య ఆరోగ్యశాఖలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 23వ రోజు కొనసాగింది. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిబ్బంది సమ్మె బాట పట్టగా, వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట సమ్మెలో పాల్గొంటున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి ఎమ్మెల్యే కోవా లక్ష్మి ఆధ్వర్యంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, మండల పార్టీ అధ్యక్షుడు రవి, కౌన్సిలర్ సాలం తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి సంఘీభావం తెలిపారు. అనంతరం వారికి భోజనం వడ్డించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు ఆకాంక్షించారు.

బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఏ సి ఎస్ ఓ సాధిక్ హుస్సేన్

కెరమెరి, నవంబర్ 4 ప్రభాతవార్త:

కిరాణా కొట్టుల్లో బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించే ధరలకే విక్రయించాలని అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి సాధిక్ హుసేని అన్నారు బుధవారం మండలంలోని పరంధోలి మొక్కజొంగూడ తుమ్మగూడ గ్రామాల్లో ఎఫ్ డి షాపుల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు అనంతరం కెరబెరి కిరాణా షాపుల యజమానులతో సమావేశమై బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఆయన వెంట. డి టి సి ఎస్ జితేందర్ ఆర్ ఐ పవన్ నాయక్ విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కెరమెరి నవంబర్ 4 ప్రభాతవార్త:

విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. బుధవారం చింతకర్ర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు విరాళంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాల దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, పాఠశాలల్లోని వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉన్నప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని సర్పంచ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి అధ్యక్షుడు పెందోర్ శ్రీనివాస్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకీ తుకారాం, సేవా సమితి సభ్యులు కంబాల వినేష్, అడ రాంచందర్, అడ ఆనంద్, ప్రకాష్ వసకే, గుణవంత్, ఉపాధ్యాయురాలు మహేశ్వరి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ రికార్డుల్లో అవకతవకలు.. కార్యదర్శులపై డీఆర్డీఓ ఆగ్రహం!

- అధికారుల సంతకాలు లేకుండానే బిల్లుల చెల్లింపులా?

చింతలమానేపల్లి,

నవంబర్ 4, ప్రభాతవార్త;

చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకొడ రైతు వేదికలో నిర్వహించిన ఐదో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామపంచాయతీ కార్యదర్శులపై డీఆర్డీఓ బనోత్ దత్తారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 కు సంబంధించిన ఉపాధి హామీ పథకం పనులు, మొక్కల పెంపకం, పింఛన్లు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డుల్లో పలు తప్పులు, వ్యత్యాసాలు ఉండటంతో ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులను నిలదీశారు. ఉపాధి హామీ పనుల్లో రెండు రోజులు పని చేసిన కూలీలకు నాలుగు రోజుల హాజరు నమోదు చేసి డబ్బులు తీసుకున్నారా? ఆరు రోజులు పని చేస్తే ఏడు రోజుల హాజరు ఎలా వేశారు? అంటూ రికార్డులను పరిశీలిస్తూ ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులలో కూలి పని చేయకున్నా, కూలి ఫోటోలు తీయకుండా ఆ కూలి యొక్క అకౌంట్లో డబ్బులు ఎలా వేసి తీశారని, గ్రామపంచాయతీ కార్యదర్శుల సంతకాలు లేకుండానే ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు ఎలా చెల్లింపులు జరిగాయంటూ ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే గ్రామాల్లో నాటిన మొక్కలను సక్రమంగా సంరక్షించకపోవడం, మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం, పింఛన్లకు సంబంధించిన వివరాలు, ఇతర రికార్డుల నిర్వహణలో లోపాలపై కార్యదర్శులను నిలదీశారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో నిరక్ష్యం వహించకుండా, ప్రతి పనికి సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన లోపాలపై సంబంధిత సిబ్బంది వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో సోయబ్, ఎస్ టి ఎం, ఎస్ ఆర్ పి పాండురంగ, ఈ సి ఎస్ సంతోష్, అనిల ప్లాంటేషన్ మేనేజర్, టి ఏ ఎస్, ఎఫ్ ఏ ఎస్, కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

చింతలమానేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త;

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ ఈరోజు చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గ్రామస్థాయిలో పోలీసులపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో కౌటాల సిఐ సంతోష్, ఎస్సై కమలాకర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

12 ఏళ్ల సాగునీటి కష్టాలకు పరిష్కారం.. 300 ఎకరాలకు నీరందేలా కృషి

- వసాకే హన్మంతుకు రైతుల ఘన సన్మానం

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 4, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీ పరిధి కోతులకుంట ప్రాంతంలో గత 12 ఏళ్లుగా సాగునీటికి నోచుకోని సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూములకు నీరందేలా కృషి చేసిన కాగజ్‌నగర్ మండల మాలి సంఘం జనరల్ సెక్రటరీ వసాకే హన్మంతును రైతులు ఘనంగా సన్మానించారు. చిన్న కాలువలు సక్రమంగా లేకపోవడంతో గత 12 ఏళ్లుగా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన వసాకే హన్మంతు సంబంధిత అధికారులతో పలుమార్లు మాట్లాడి, ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోసిని గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి ఆధ్వర్యంలో రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు కలిసి వసాకే హన్మంతును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లికార్జున్, రవి, రామయ్య, రవీందర్, శ్రీనివాస్, మోతిరావు, నవీన్, మమత, సుశీల, మోదంపూరి శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. రైతుల కష్టాలను తనవిగా భావించి, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన హన్మంతు సేవలను గ్రామస్తులు అభినందించారు.

అంగరంగ వైభవంగా దండారి ఉత్సవాలు

లింగాపూర్, నవంబర్04, ప్రభాతవార్త:

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, లింగాపూర్ మండలంలోని పిట్టగూడ, మామిడిపల్లి, జాములధర నాగుగూడ, గ్రామాలలో భోగి పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో గ్రామస్తులంత కలసి ఏత్మాసూర్ దేవత సంప్రదాయ వాయిద్యాలైన, డప్పు పర్ర వేట్టేలను పూజించి దండారి వేడుకలను ప్రారంభించారు నేటి నుంచి దండారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి ఉత్సవాలు గ్రామంలో పండుగ శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయ వాయిద్యాల నడుమ దండారి నృత్యాలు, ఆటపాటలతో గ్రామమంతా సందడిగా మారింది. యువత, మహిళలు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటూ తరతరాలుగా వస్తున్న ఆదివాసీ సంస్కృతి వారసత్వాన్ని కాపాడుతూ ముందుకు సాగుతున్నారు. దండారి అనేది కేవలం ఒక నృత్యం కాదు. అది మన అస్తిత్వం, మన ఆత్మగౌరవం, మన పూర్వీకుల నుంచి మనకు అందిన గొప్ప వారసత్వం అని కరేసేంగా ఈశ్వర్, మడవి సోను కుమార్, మడవి శేషారావు, తదితర గ్రామస్తులు పేర్కొన్నారు.

నీట్‌లో మెరిసిన గిరిజన విద్యార్థి

- ధర్మసాగర్ గ్రామానికి, సిరికొండ మండలానికి దక్కిన గొప్ప గౌరవం
- కఠోర శ్రమ, పట్టుదలతో సాధించిన ఘనత: గ్రామస్తుల హర్షం

బజార్‌హత్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

అన్ని రకాల సవాళ్లను అధిగమించి, జాతీయ స్థాయి నీట్ (వినినిగి) పోటీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఎంబీబీఎస్ వైద్య విద్యలో ఉచిత సీటు సంపాదించడం ధర్మసాగర్ గ్రామానికే కాకుండా, సిరికొండ మండలానికే ఎంతో గర్వకారణమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, గ్రామీణ ప్రాంతంలో సరైన వసతులు లేకపోయినా.. వాటన్నింటినీ తన సడలని పట్టుదల, కఠోర శ్రమతో జయించి గిరిజన విద్యార్థి ఈ అరుదైన ఘనత సాధించడం నిజంగా ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ విజయం మరెంతో మంది గ్రామీణ విద్యార్థులకు, ముఖ్యంగా మారుమూల ఏజెన్సీ ప్రాంత గిరిజన బిడ్డలకు ఒక గొప్ప స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో సదరు విద్యార్థి తన వైద్య విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసి, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తూ ఉన్నతమైన స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు గ్రామీణులు ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ నీటిని విడుదల చేయాలి

బజార్ హత్నూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

మండలం లోని బజార్ హత్నూర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ నీటిని విడుదల చేయాలని పత్తి, కంది రైతులు సంబంధిత అధికారులను కోరారు. ఐదు రోజులు విడుదల చేశారు కానీ కరెంట్ సరఫరాలో అంతరాయం తో పూర్తిగా నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందని, దయచేసి మరో మూడు రోజులు నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు సోయబిన్ కోత సమయంలో పదిహేనురోజులు వరకు కెనాల్ ఓవర్ ఫ్లో అయి నీరు వృధాగా పోయయని తెలిపారు. ఏలినో ప్రభావంతో పత్తి జులై, ఆగష్టు నేలల పెరుగుదల తక్కువగా ఉండగా, ప్రస్తుతం పూత, ఖాతా సమయంలో నీరు ఇస్తే దిగుబడి వస్తుంది అనుకుంటే, అధికారులు వల్ల దేగామా, గిర్నూర్, బలన్ పూర్, కాండ్లి, మొహాడా, వర్తమాన్నూర్ తదితర గ్రామాలకు చెందిన పత్తి, కంది రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయాన్నారు. ఇప్పటికైనా నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త :

ఈ నెల 6న ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక మాతృశ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సదస్సులో ఎస్సీ వర్గీకరణ ఫలాల సాధన, సామాజిక న్యాయం, సమానత్వం, అంటరానితనం నిర్మూలన, కులరహిత సమాజ నిర్మాణంపై చర్చించనున్నట్లు తెలిపారు. అదేవిదంగా మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులు ఈ సదస్సులో అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం మాతృశ్రీ కళాశాల కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా నిదురపు సాయికుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సునీల్ మాదిగ, సభ్యులుగా కళ్యాణ్, దినేష్, ప్రవీణ్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో రేగుంట కేశవ్ రామ్ మాదిగ, చిప్పకూర్తి సతీష్ మాదిగ, జంగాపల్లి రాజేష్ మాదిగ, పిట్టల సత్యనారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జీయర్ గురుకులం విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

- హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్న అల్లంపల్లి విద్యార్థులు
- విద్యార్థుల ప్రతిభ కళాశాలకు గర్వకారణం: ప్రిన్సిపాల్ మహేందర్

సారంగాపూర్, నవంబర్ 04, ప్రభాతవార్త:

అల్లంపల్లి జీయర్ గురుకులం జూనియర్ కళాశాల విద్యార్థులు అండర్19 విభాగం రాష్ట్రస్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఈ విద్యార్థులు జిల్లా తరఫున పాల్గొననున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. ఈ సందర్భంగా జీయర్ గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థులు క్రీడారంగంలో తమ అసమాన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు రూపేష్, కళ్యాణ్, అక్షయ్, శివగోపాల్, నందిని, స్ఫూర్తిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధర్, పీఈటీ జుగాదిరావు, శాంతారం స్వామీజీ ప్రత్యక్షంగా కలిసి హర్షం వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జీయర్ గురుకులం కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో నిరంతరం సాధిస్తున్న విజయాలు కళాశాలకు ఎనలేని గర్వకారణంగా నిలుస్తున్నాయని ఉపాధ్యాయ బృందం పేర్కొంది.

రావులపల్లి నరసింహ స్వామికి ఘన నివాళి

- చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన డా. కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 4, ప్రభాతవార్త :

పట్టణంలోని సర్ సిల్క్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి, వాకర్స్ అసోసియేషన్ గౌరవ సభ్యుడు కీ.శే. రావులపల్లి నరసింహ స్వామి ఆకస్మిక మరణం తీరని లోటని డా. కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. నరసింహ స్వామి దశదిన కర్మ సందర్భంగా గురువారం ఆయన నివాసంలో డా. కొత్తపల్లి శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి నరసింహ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి సేవలను, అనుబంధాన్ని స్మరించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. నరసింహ స్వామి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.